01ATP12_01ATP12.qxd 12-04-2026 PM 11:25 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి


తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 13 ఏప్రిల్ 2026 పేజీలు : 04


# విపరీతమైన ఎండ వేడిమికి అల్లాడిపోతున్న ప్రజలు..!

- 39 నుంచి 40 డిగ్రీల సెల్సియస్‌గా నమోదువుతున్న ఎండలు
- బయటికెళితే భరించలేనంత వేడి..ఇంట్లోకొస్తే విపరీతమైన ఉక్కపోత
- నిలువ నీడకోసం మనుషులతోపాటు పశు పక్షాదులకు తప్పని అవస్థలు
- ఉదయం నుంచి సాయంత్రం 6 వరకు ప్రతాపం చూపుతున్న సూర్యుడు
- ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కనిపించని టెంట్లు, నీటి సౌకర్యాలు



ఉరవకొండలో మధ్యాన్నం 1 గంటల సమయంలో ప్రధాన రోడ్డులో రద్దీ లేని దృశ్యం

**ఉరవకొండ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త**

ఎండ వేడిమికి ప్రజలు అల్లాడిపోతున్నారు. గడిచిన వారం పది రోజులుగా ఎండ తీవ్రత రోజురోజుకీ విపరీతంగా పెరిగిపోతుండగా 39 నుంచి 40 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అవుతోంది. ఉదయం 8 గంటల నుంచి సూర్యుడు తన ప్రతాపం చూపిస్తుండగా సాయంత్రం 6 గంటల వరకు అదే పరిస్థితి కొనసాగుతోంది. బయటకు వెళితే విపరీతమైన ఎండ వేడిమి..ఇంట్లోకి వస్తే భరించలేని ఉక్కపోత ప్రజలను సతమతం చేస్తోంది. రెక్కాడితేగాని డొక్కాడని చిరువ్యాపారులు రోడ్లపైనే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఇతరత్రా నిత్యవసరాలను ఎండ వేడిమితోనే విక్రయించుకోవడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. పశు పక్షాదుల పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. ఎక్కడా నిలువ నీడ, నీటి లభ్యత లేక వాటి మూగ రోదన కలిచి వేస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ అత్యవసర పని ఉంటేగాని బయట తిరగవద్దని విస్తృతంగా ప్రచారం చేస్తున్నా చిరు వ్యాపారుల గురించి పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చిరు వ్యాపారులను చైతన్యం చేసి వారు వడదెబ్బ బారిన పడకుండా తగిన సూచనలు, సలహాలు ఇచ్చి వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం లేదని పలువురు వాపోతున్నారు. ఉపాధిహామీ పనుల ప్రదేశంలో కూలీలకు నీడ కోసం టెంట్లు, నీటి వసతి, ప్రాధమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉండటంలేదని తెలుస్తోంది. ఉద్యోగ రిత్యా ఒక ఊరి నుండి మరో ఊరికి వెళ్లాల్సినవారి ఇబ్బందులు వర్ణణాతీతంగా మారుతున్నాయి. అనేక మంది బస్సుల్లో రాకపోకలు సాగిస్తుండగా కచ్చితమైన సమయానికి చేరుకోవచ్చని మిగిలినవారు ద్విచక్రవాహనాల్లో ప్రయాణిస్తూ ఎండ తీవ్రతకు అనేక మంది వడదెబ్బ లక్షణాలతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా సేదతీరడానికి ఒక చెట్టు కూడా లేకపోవడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడక తప్పడంలేదు. అంతే కాకుండా ప్రధాన కూడళ్లలో ఎక్కడా ప్రయాణీకుల కోసం బస్ షెల్టర్లు సైతం ఏర్పాటు కాకపోవడంతో ప్రయాణీకుల ఇబ్బందులు వర్ణణాతీతమని చెప్పాలి. ముఖ్యంగా పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో సులభా కాంప్లెక్‌వద్ద బస్టాప్‌లో బస్సుల కోసం ప్రయాణీకులు పిల్లా పాపలతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండగా వారి ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాదని చెప్పాలి. బస్ షెల్టర్లు లేని ప్రదేశాల్లో ఎండ వేడిమికి ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చలువ పందిళ్లు లేదా షామియానా టెంట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కనీసం స్వచ్ఛంధ సంస్థలైనా స్పందించి వివిధ ప్రదేశాల్లో నీడ కోసం షామియానా టెంట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అంతే కాకుండా నీరు, శీతలపానీయాలు అందిస్తే మరీ బాగుంటుందని చెబుతున్నారు.

# బండ్లపల్లిలో ముగిసిన సిపిఐ పాదయాత్ర

- మూడు రోజులు కొనసాగిన పాదయాత్ర - ముగింపు కార్యక్రమానికి హాజరైన సిపిఐ జాతీయ ప్రధాన కార్యాదర్శి రాజా
- జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని తీసుకుపోతామన్న రాజా





పాదయాత్రలో పాల్గొన్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తదితరులు.

**అనంతపురం, ఏప్రిల్ 12,(ప్రభాతవార్త బ్యూరో)**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నిన ప్రధాని నరేంద్ర మోడీని దేశ ప్రజలు క్షమించరని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు వామపక్ష పార్టీలతో కలిసి జాతీయస్థాయిలో ఉద్యమాన్ని తీసుకెళ్తామని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరు కార్చిన విధానాన్ని ఎండగడుతూ గత మూడు రోజుల క్రితం అనంతపురం రూరల్ మండలం సమతా గ్రామం నుంచి ప్రారంభ మైన పాదయాత్ర నార్పల మండలం బండ్లపల్లి వరకు సిపిఐ జాతీయ కార్య దర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో సాగిన పాదయాత్ర ముగింపుసభ ఆదివారం నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, బి కే ఎం యు జాతీయస్థాయి నాయకుడు గుల్జార్ సింగ్,అనంతపురం సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, శ్రీ సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ ఇతర ముఖ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బండ్లపల్లి లో జరిగిన ముగింపు సభ లో సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.ఈ పథకాన్ని ఎక్కడైతే కాంగ్రెస్, వామ పక్షాలు కలిసి అప్పట్లో ప్రారంభం చేసారో అక్కడే బహిరంగ సభ జరగడం చాలా అనందంగా ఉందన్నారు... ఇది ముగింపు సభ కాదు, ఇది ఆరంభ సభ అన్నారు.గ్రామీణ పేద కూలీలకు, సన్న కారు రైతులకు అండగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేసి, వి బి జి రామ్ జి అనే పథకాన్ని తెచ్చి పేదలకు చాలా అన్యాయం చేసిందన్నారు.నేను వ్యవసాయ కూలీ కుటుంబం లో జన్మించాను. అందుకే నాకు వారి ఆర్థిక బాధలు తెలుసు అన్నారు. వలసలు ఆపడం కోసం తెచ్చిన చట్టాన్ని నిర్వీర్యం చేసి కుట్ర పన్నుతున్న మోడీ ని దేశం క్షమించదు అని రాజా అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తిరిగి పునరుద్దరణ చేసే వరకు మేము పోరాటం చేస్తాం అన్నారు.దేశాన్ని అప్పుల పాలు చేసిన ఘనత మోడీ దే అని ఆయన ఆరోపించారు. కష్టజీవులు ఉన్నంతకాలం ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుంది....సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ వెల్లడి..... సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశంలో కష్టజీవులు, కార్మికులు, రైతులు ఉన్నంతకాలం ఎర్రజెండా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఆయన చెప్పారు. పేద కూలీల కోసం కోసం చేపట్టిన పాదయాత్రను ఎవరు అడ్డుకున్నా వెనక్కి తగ్గేది లేదని, ఎదురొచ్చిన అడ్డంకులను తొక్కుకుంటూ ముందుకు సాగుతామని ఘాటుగా వ్యాఖ్యానించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేసిన ఆయన, కేంద్రం గతంలో 90 శాతం నిధులు భరించేదని, ఇప్పుడు 60 శాతానికి తగ్గించడం అన్యాయమన్నారు. మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఎలా భరిస్తుందో కేంద్రం చెప్పాలని ప్రశ్నించారు. రైతులు అప్పులపాలు అయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నా గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం రైతులకు ఏమి చేసిందని నిలదీశారు. దేశంలో భూములు ఉన్న రైతులు కూడా వాటిని అమ్ముకుని వలసలు వెళ్లి కూలి పనులు చేసుకునే దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కేంద్రం సంవత్స రానికి కేవలం రూ.6 వేలు మాత్రమే ఇస్తోందని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెలకు రూ.4 వేల చొప్పున సహాయం అందించడం రైతులకు మేలు చేస్తున్న చర్యగా పేర్కొన్నారు.దేశ ఆర్థిక పరిస్థితి కూడా దిగజారిందని రామకృష్ణ అన్నారు. 2014లో ఒక డాలర్ విలువ రూ.60 ఉండగా, ప్రస్తుతం రూపాయి విలువ తీవ్రంగా పడిపోయిందని, దేశం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ, ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. దేశంలోని కోట్లాది కష్టజీవుల హక్కుల కోసం ఈ పాదయాత్ర ఎర్రజెండా పోరాటానికి ప్రతీక అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్, జాతీయ కాంగ్రెస్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా సంఘీభావం తెలిపారు.

# తాడిపత్రి అభివృద్ధిని అడ్డుకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించను

- మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫైర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త**

తాడిపత్రి అభివృద్ధి విషయంలో ఎంత దూరం వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నానని అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై తాడిపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. తాడిపత్రి అభివృద్ధికి అడ్డుపడితే ఊరుకునేది లేదని, ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే ఉండదని జె.సి ప్రభాకర్‌రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. స్థానిక నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓ దినపత్రికలో పెన్నానదిని అక్రమణ అని కథనం రాశారని, వాళ్లకు కళ్ళు, చెవులు పనిచేస్తున్నాయో లేదో నాకు తెలియదన్నారు. ఒకసారి ఆలయాన్ని సందర్శించి వార్తలు రాస్తే బాగుంటుం దన్నారు. బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణమండపం , ప్రహరీ గోడలు శిథిలావస్థకు చేరాయని, వాటిని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. పెన్నానదిని ఆక్రమించుకునేంత గతి నాకు పట్టలేదన్నారు. గతంలో మురుగునీరు, వరద నీరు ప్రవాహం వల్లే ప్రహరీ గోడలు కుంగిపోయాయని, వరద నీటిని మలుపు తిప్పేందుకే సొంత నిధులతో పెన్నానదికి సైడ్‌వాల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. టెంపుల్ సిటీ ఆఫ్ రాయలసీమగా తాడిపత్రిని చేయాలనేదే మా సంకల్పమన్నారు. పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేసింది వైసీపీ వాళ్ళని గుర్తు చేశారు. గతంలో అక్రమాలకు పాల్పడింది మీరేనని, కోర్టుకు వెళ్లడం మీకు అలవాటే కదా అన్నారు. కోర్టుకు వెళ్లిన తాడిపత్రి ప్రజలు అభివృద్ధి పనులను ఆపరన్నారు. 2027 నాటికి తాడిపత్రి అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానని జె.సి ప్రభాకర్‌రెడ్డి తెలియజేశారు.

# క్రికెట్ బెట్టింగ్‌ల జోలికెళ్తే తాట తీస్తాం : జిల్లా ఎస్పీ జగదీష్

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 12 ప్రభాతవార్త**



జిల్లా ఎస్పీ జగదీష్

ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌ల నేపథ్యంలో ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ ల జోలికెళ్తే తాట తీస్తామని జిల్లా ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. చేశారు. ఐపీఎల్‌ను ఆసరాగా తీసుకుని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రూపాల్లో విస్తరించకుండా బెట్టింగ్ ముఠాలను పూర్తిగా అణచివేయడానికి జిల్లా పోలీస్ శాఖ సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. సులభంగా డబ్బు వస్తుందనే మాయలో పడితే అది కేవలం నష్టం మాత్రమే కాదు వ్యక్తిగత జీవితం, కుటుంబ స్థిరత్వం, భవిష్యత్తు అవకాశాలన్నీ ప్రమాదంలో పడతాయని స్పష్టం చేశారు. బెట్టింగ్ వ్యసనం అప్పులు, బెదిరింపులు, మానసిక ఒత్తిడి, నేర సంబంధాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. జిల్లాలో అక్రమ క్రికెట్ బెట్టింగ్‌ను అరికట్టేందుకు పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు, డార్క్ వెబ్ కార్యకలాపాలపై సైబర్ బృందాలు నిరంతర నిఘా నిర్వహిస్తున్నాయన్నారు. బాల్‌టుబాల్ బెట్టింగ్ జరిగే ప్లాట్‌ఫార్మ్‌లలో ట్రాన్సాక్షన్ ప్యాటర్న్‌లను విశ్లేషించి అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తిస్తున్నామని వివరించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫార్మ్‌లలో బెట్టింగ్ ప్రచారాలను ట్రాక్ చేస్తామన్నారు.అనుమానాస్పద ప్రదేశాలు, హాట్‌స్పాట్‌లలో సీసీటీవీ ఫుటేజ్ విశ్లేషణతో పాటు గ్రౌండ్ లెవెల్ ఇన్‌ఫార్మేషన్ సేకరణ ఉందన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొన్నా, నిర్వహించినా, ప్రోత్సహించినా ఏపీ జూద చట్టం ప్రకారం... క్రిమినల్ కేసులు నమోదు, అరెస్టులు, సస్పెక్ట్ షీట్లు ఓపెన్, బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్, డిజిటల్ పరికరాల స్వాధీనంతో పాటు భవిష్యత్తులో ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు కోల్పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# ఆకులేడు రామచంద్రారెడ్డి ఇకలేరు

- నేడు అంత్యక్రియలు

**అనంతపురం, ఏప్రిల్ 12, (ప్రభాతవార్త బ్యూరో)**



సీనియర్ వైసీపీ నేత ఆకు లేడు రామచంద్రారెడ్డి (74)ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు తుది శ్వాసకు విడిచినట్లు సమాచారం. అనంతపురం జిల్లా సింగనమల మండలం ఆకులేడు గ్రామంలో రామచంద్రారెడ్డి మృత దేహానికి సోమవారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని ఆయన కుమారుడు రాంరెడ్డి తెలియజేశారు. ఆకు లేడు రామచంద్రారెడ్డి సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో పనిచేసి జిల్లా అభ్యున్నతి కోసం, రైతుల కోసం జిల్లా ముఖ్య నేతలతో కలిసి పనిచేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డికి క్లాస్ మీట్ అని చెబుతుంటారు. మంచి ఆప్తుడు.. కాంగ్రెస్ హయాంలో ఒక నాయకునిగా చురుకైన పాత్ర వహించారు. పలువురు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఇతర నేతలతో మంచి సంబంధాలు కొనసాగించేవారు. ఆయన ఆకులేడు నుంచి తరచూ అనంతపురానికి వచ్చి రైతుల సమస్యలపై ప్రజా ప్రతినిధులకు ,అధికారులకు నివేదించేవారు. చేతిలో ఎప్పుడూ ఒక చిన్న బ్యాగ్ ఉండేది. తెల్లని దుస్తులు ధరిస్తూ తనకు పరిచయం ఉన్న స్నేహితులను, జర్నలిస్టులను, కార్యకర్తలను, నాయకులను ఆప్యాయంగా పలకరించేవారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ గా, వ్యవసాయ కమిటీ డైరెక్టర్ గా , ప్రజల పదవుల్లో కొనసాగారు. గత ఐదు నెలల నుంచి తీవ్ర అస్వస్థకు గురైనట్లు తెలియ వచ్చింది. రామచంద్రారెడ్డి మరణం పట్ల పలువురు వైసిపి, కాంగ్రెస్ నాయకులు, ఇతర అభిమానులు సంతాపం ప్రకటించారు.

# పగులుతున్న పైపులు

- దాహంతో అల్లాడుతున్న గ్రామాలు



పైపుకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

**వజ్రకరూరు ఏప్రిల్ 12 ప్రభాతవార్త**

మండలంలోని ప్రధాన త్రాగునీటి వనరైనా సత్యసాయి మంచినీటి ప్రాజెక్టు పైపులు అను నిత్యము పగిలిపోతుండడంతో మండల వ్యాప్తంగా ప్రధానంగా13 గ్రామాలలో నీటి ఎద్దడి నెలకొని ప్రజలు దాహంతో అల్లాడిపోతున్నారు. సత్యసాయి మంచినీటిని సరఫరా చేసే పైపులు కాలం చెల్లడంతో పైపులు పగిలిపోవడం నిత్య కార్యక్రమంగా మారింది. దీంతో నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో నీటి సమస్య మరింత జఠిలంగా మారింది. మీరు వదిలిన రోజు కుళాయిల వద్ద మహిళలు మాటలతూటాలతో చిన్నపాటి యుద్దాలను తలపిస్తున్నారు. పగులుతున్న పైపులకు మరమ్మతులు చేయడానికి మండుటెండల్లో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వాలు పైప్ లైన్ మార్పులు గురించి పట్టించుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వం కూడా దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పైపులు మరమ్మతులు చేసి నీటిని వదలడానికి రెండు మూడు రోజులుగా పడుతున్నడంతో గ్రామాలు తీవ్ర నీటి సమస్య ను ఎదుర్కొంటున్నాయి. పాలకులు మోలిక వసతులైన ఇలాంటి వాటి మీద ప్రధానంగా దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.


అనంతలో అర్ధరాత్రి ఎస్పీ తనిఖీలు 4 >>


# గారాబానికి కరిగిపోవద్దు..సమస్యల్లో ఇరుక్కోవద్దు..!

- మైనర్లే రైడర్లు..తల్లిదండ్రులే బాధ్యులు
- కఠిన చట్టాలున్నా..మార్పు సున్నా..!



ఇటీవల తాడిపత్రి-కడప రోడ్డులో యువకుల విన్యాసాలు



తల్లిదండ్రులకు, నిర్ణీత వయసులేని పిల్లలకు ఏఎస్పీ అవగాహన

**తాడిపత్రి, ఏప్రెల్ 12, ప్రభాతవార్త**

ద్విచక్ర వాహనాల ప్రమాదాలకు అపరిపక్వత వయసులో వాహనాలు నడపడటం కూడా ప్రధాన కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదాల్లో అక్కడక్కడ మైనర్లు కూడా మరణిస్తుండటం గమనార్హం. కొందరు పెద్దలే పిల్లల గారాబానికి కరిగిపోయి ద్విచక్ర వాహనాలు ఇస్తుండటంతో వారు ఇద్దరు, ముగ్గురిని ఎక్కించుకొని రోడ్లపై చక్కర్లు కొడుతున్నారు. ఎక్కడ చూసినా ఎక్కువగా మైనర్లే ద్విచక్రవాహనాలపై కనిపిస్తున్నారు. ఇటువంటి ప్రమాదకర ప్రయాణాలపై పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. అనంతపురం జిల్లాలో ద్విచక్రవాహన ప్రమాదాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. వీటికి అనేక కారణాలున్నా అపరిపక్వత వయసులో వాహనాలు నడిపే యువకుల పరిస్థితి అందరినీ కలవర పెడుతోంది. పిల్లలు ఇంట్లో గారాబం చేస్తున్నారని, గొడవ చేస్తున్నారని పెద్దలు వారికి వాహనాలు కొనివ్వడమో, తమ అవసరాల కోసం కొన్న వాహనాలను మైనర్ల చేతికి ఇవ్వడమో చేస్తున్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి కఠిన చట్టాలున్నా అవి సక్రమంగా అమలుకు నోచుకోకపోవడంతో పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు.

**:కఠిన చట్టాలున్నా..!**

అపరిపక్వత వయసు గల పిల్లలు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపైనే కేసు నమోదు చేసేందుకు చట్టంలో వెసలుబాటు ఉంది. నిబంధనలకు విరుద్ధంగా, బాధ్యతారాహిత్యంగా ద్విచక్రవాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చేసి లైక్‌ల కోసం విచిత్ర విన్యాసాలు చేస్తూ వీడియోలు రికార్డు చేస్తున్నారు. ఈ క్రమంలో తమతో పాటు ఇతరులనూ ప్రమాదాలకు గురి చేస్తున్నారు. జిల్లాలోని పాఠశాలలకు, కళాశాలలకు ఎక్కువ మంది యువకులు ద్విచక్రవాహనాలపై వస్తున్నారు. 18 ఏళ్లు నిండకుండా బండి నడపడం చట్టరీత్యా నేరం. ప్రభుత్వాలు ఎన్ని కఠిన చట్టాలు తెచ్చినా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించడం లేదని విమర్శలు ఉన్నాయి. అపరిపక్వత వయసు పిల్లలు వాహనాలు నడుపుతూ ఎక్కువగా పోలీసులకు చిక్కుతున్నారు.

**:తల్లిదండ్రులదే బాధ్యత**

మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుపడితే వాహనాలను సీజ్ చేస్తారు. మరోసారి పోలీసులకు చిక్కితే రూ. 10 వేల వరకు జరిమానా విధిస్తారు. మైనరు ద్విచక్రవాహనం నడుపుతూ ప్రమాదానికి కారణమైతే తల్లిదండ్రులకు, సంరక్షకులకు జైలు శిక్ష విధించడంతో పాటు వారి డ్రైవింగ్ లైసెన్సు కూడా రద్దు చేస్తారు. 16-18 ఏళ్ల వయసు వారు గేర్లు లేని ద్విచక్రవాహనం నడపవచ్చు. 18 ఏళ్లు నిండిన తరువాతే బైకు, కారు లైసెన్సు తీసుకోవాలి. తాడిపత్రి పోలీసు సబ్ డివిజన్‌లో మైనర్లకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడాన్ని పోలీసులు ఓ స్పెషల్ డ్రైవ్‌లా చేపట్టారు. ఇకపై ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా పిల్లలు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వారితో ప్రమాణం చేయిస్తున్నారు. పిల్లలు ఎంత గారాబం, ఒత్తిడి చేసినా ద్విచక్రవాహనాలు ఇవ్వకుండా ప్రత్యామ్నాయ మార్గాలను తల్లిదండ్రులు వెతుక్కోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రమాదాల తీవ్రత,కేసుల్లో ఇరుక్కుంటే కలిగే ఇబ్బందులను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు.



తాడిపత్రిలో అవగాహన కార్యక్రమానికి హాజరైన పిల్లలు, పెద్దలు



యాడికిలో యువకులకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ

**:ప్రత్యేక చొరవ**

తాడిపత్రి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్ల సీఐలు ఆరోహణరావు, శివగంగాధర రెడ్డి, శ్రీనివాసులుతో పాటు ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి తల్లిదండ్రులకు, వారి పిల్లలకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.నిబంధనలు ఉల్లంఘించి

వాహనాలు నడిపిన 45 మంది మైనర్లకు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసుల చర్యలతో పాటు తల్లిదండ్రుల్లోనూ మార్పు రావాలని, అలా వచ్చినప్పుడే ఏ మైనరు అయినా వాహనం నడపాలంటే ఆలోచించే పరిస్థితి వస్తుందని పోలీసులు సూచిస్తున్నారు.

02ATP12_02ATP12.qxd 12-04-2026 PM 11:19 Page 1



## వ్యక్తి మృతి - కేసు నమోదు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

**చిలమత్తూరు, ఏప్రిల్ 12 ప్రభాతవార్త**



మృతి చెందిన బావిరెడ్డి (ఫైల్‌ఫోటో)

చిలమత్తూరు మండల పరిధిలోని గాడ్రాళ్లపల్లి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బావిరెడ్డి (45) మృతి చెందిన సంఘటన ఆదివారం ఆ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గాడ్రాళ్లపల్లి గ్రామానికి చెందిన బయపరెడ్డి అల్లుళ్లు తమ ఇంటిలో జరిగిన పిల్లల జన్మదిన వేడుకలకు శనివారం రెండు కార్లలో వచ్చారు. అర్ధరాత్రి బయట నిలిపి ఉన్న రెండు కార్ల అద్దాలపై అదే గ్రామానికి చెందిన బావిరెడ్డి రాళ్లు వేసి పగులకొట్టడంతో గమనించిన బాధితులు, ఆ గ్రామస్తులు పోలీసులకు ఫోన్ చేసి విషయం తెలుపుగా వారు హుటాహుటిన పోలీస్ సైరన్‌తో రావడాన్ని గమనించిన బావిరెడ్డి సంఘటనా స్థలం నుండి గ్రామ శివారులోని పొలాల్లోకి పారిపోయాడు. అర్ధరాత్రిలో ఎంత వెతికినా కనబడక పోవడంతో బావిరెడ్డి పరిస్థితిపై పోలీసులు ఆరా తీయగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నాడని గ్రామస్తులు చెప్పడంతో పోలీసులు తిరిగి వచ్చేశారు. ఆదివారం ఉదయం ఆ గ్రామానికి చెందిన నేసే నారాయణప్ప పశువుల గ్రాసం కోసం కొడవలి వెంట తీసుకొని తన పొలంలోకి వెళ్లగా ఆ పొలంలోనే దాక్కున్న బావిరెడ్డి ఒక్కసారిగా నేసే నారాయణప్ప వద్ద వున్న కొడవలి లాక్కొని తీవ్రంగా చేతిపై దాడి చేయగా అక్కడి నుండి నారాయణప్ప గ్రామానికి ప్రాణ భయంతో వచ్చి తమ కుటుంబసభ్యులకు, గ్రామస్తులకు దాడి విషయం తెలిపాడు. దాడిలో గాయపడిన వ్యక్తి కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు బావిరెడ్డిని గాలించి పట్టుకొనేందుకు ప్రయత్నించగా వారిపై కూడా బావిరెడ్డి ప్రతిదాడి చేయగా ఆత్మ రక్షణ కోసం బావిరెడ్డిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అపస్మారక స్థితిలోకి వెళ్ళిన బావిరెడ్డిని పోలీసులు వచ్చి చూడగా మృతి చెందాడు. హిందూపురం సిఐ చంద్రా ఆంజనేయులు, చిలమత్తూరు ఎస్ఐ మునీర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మతిస్థిమితం లేకుండా మృతిచెందిన బావిరెడ్డి గతంలో 2007, 2014లో రెండు కేసుల్లో పోలీసుల రికార్డుల్లో కీలక ముద్దాయిగా ఉన్నాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కొంతమంది వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాత పెన్షన్ సాధన కోసం మే1న కడపలో జరిగే మహా సంకల్పగర్జనకు తరలి రండి



మహాసంకల్ప గర్జన పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

**పెనుకొండ ఏప్రిల్ 12ప్రభాతవార్త**

పాతపెన్షన్ సాధనకోసం ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిమెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే1వతేదీన కడపలో జరిగే మహాసంకల్ప గర్జనకు భారీ ఎత్తున తరలి రావాలని కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిమెంట్ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పెనుకొండ జూనియర్ కాలేజీ గ్రౌండ్ నందు ఏపీసీపీఎస్ ఈ ఏ మహాసంకల్ప గర్జన పోస్టర్లను ఏపీసిపిఎస్ ఈఏ స్టేట్ కౌన్సిలర్ రంగేష్ కుమార్ ,మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర శేఖర్,రఘునాథ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతపెన్షన్ సాధనకోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఉంటామని, సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేసి నాలుగు లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాల్లో వెలుగు నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని, డిప్యూటీ సీ ఎం పవన్ కళ్యాణ్ ని,మంత్రి లోకేష్ ని కోరుతున్నామన్నారు.అలాగే పెనుకొండ మండలంలోని సీ పీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సచివాలయం ఉద్యోగుల కచ్చితంగా మే1న కడపలో జరిగే ఈకార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. పై కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు అయిన వెంకటేష్,ముత్యాలప్ప, నరేష్ కుమార్, శ్రీనివాసులు,బాబు, రుద్రేశ్ ,నాయకులు మల్లికార్జున, చంద్రమౌళి, సంజీవ,ప్రభాకర్ రెడ్డి, ఉలవల నాగరాజు,రామకృష్ణ, రామాంజనేయులు, రమేష్, నరేష్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని ఎంఈఓకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన ఎంఈఓ

**అగళి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త**

మండల విద్యాధికారి కృష్ణమూర్తి రాజుకు ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో కుడి కాలుకు తలకు బలమైన రక్త గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స ను అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందజేయగా మెరుగైన చికిత్స కోసం కర్ణాటక రాష్ట్రం సిరా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి తుంకూర్ శ్రీదేవి ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. హైవే రోడ్డులో వాకింగ్‌కు వెళుతుండగా ద్విచక్ర వాహనంలో అతివేగంతో వాహనం ముగ్గురు ఉండి ఢీకొట్టడంతో ఎంఈఓ పడిపోయారు. ఎంఈఓ త్వరగా కోలుకోవాలని మండలంలోని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## 14న సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**ఉరవకొండ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త**



బి.రాంమోహన్

ఈనెల 14వ తేదీన ఉరవకొండ పట్టణంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు జరుగుతాయని ఉరవకొండ ఏఎస్‌డబ్ల్యూవో బి.రాంమోహన్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లా డుతూ వేడుకలు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిదిగా హాజరవుతారన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పుష్పాలం కరణ, సభా కార్యక్రమం నిర్వహించి ఘన నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు. ఉరవ కొండ నియోజకవర్గంలోని ప్రజా ప్రతి నిధులు, అధికారులు, ఉద్యోగులు, షెడూ ్యల్డు కులాలు, షెడ్యూల్డు తెగల నాయకులు తరలిరావాలని ఏఎస్‌డబ్లూ ్యవో పిలుపునిచ్చారు.

## దశాబ్ద కాలంగా స్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడ్డ ప్రజలు

- వార్తలో పలు కథనాలు స్మశాన వాటికలపై ప్రచురణ
- దీర్ఘకాలిక సమస్యలకు స్పందించిన ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు
- 13.40 ఎకరాలు స్మశాన వాటికలకు రెవెన్యూ అధికారులు కేటాయింపు

**అగళి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త**

వార్త ప్రభావం

నిరుపేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలకు అసలు భూములే ఉండవు. దున్నడానికి కాదుకదా చనిపోయిన వారిని పూడ్చడానికి భూములు లేక దశాబ్ద కాలంగా ఇబ్బందులు పడ్డారు. స్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతూన్నరని, ఏటిలోనో మరోచోటో మృతిచెందిన వారిని పూడుస్తున్నారని పూడ్చిన మొదటి సంవత్సరం సమాదులు లేక వాటికి పూజలు, పునస్కారాలు చేయక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో పేదలకు స్మశాన వాటికలు లేవన్న విషయాన్ని వార్తలో పలు సార్లు కథనాలు ప్రచురించబడ్డాయి. ఆ కథనాలకు స్పందించి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి స్పందించి అగళి మండలంలో పేదలకు స్మశాన వాటికల కోసం స్థలాలను కేటాయించాలని, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ దేశాల ప్రకారం రెవెన్యూ అధికారులు మండలంలో 13.40 ఎకరాలను స్మశాన వాటికల కోసం కేటాయించారు. ఆలూడి, కదిరేపల్లి, కరిదాసనపల్లి, బ్యాడిగెర, వడగుంటనపల్లి, యుటిపల్లి, ఇరిగేపల్లి, రామాపురం, బొమ్మాసనపల్లి, ఆర్‌జిపల్లి, ముకడాంపల్లి, దాసే గౌడనపల్లి, హనుమనపల్లి, పూలపల్లి, గంగమరపల్లి, కోడిపల్లి, దొక్కలపల్లి, అల్లికెర, లక్ష్మీపురం, బీరనపల్లి,నర్సాంబూది, రామణపల్లి, పురుషాంగనపల్లి, కసాపురం, జిజి హల్లి, హుల్లేకెర, గాయత్రి కాలనీ, మధూడి, అగళి తదితర గ్రామాలకు స్మశాన వాటికల నిర్మాణాల కోసం రెవెన్యూ అధికారులు భూములు కేటాయించారు. దశాబ్ద కాలంగా చనిపోయిన వారిని పూడ్చడానికి స్థలం లేక ఇబ్బందులు పడ్డ పేదల కన్నీటిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి చొరవతో ఆ సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేవలం చనిపోయిన వారు భూములున్న యజమానులు మాత్రం పూడ్చి సమాధులు నిర్మించి ప్రతి యేటా పూజలు నిర్వహించుకునే వారు అ లాంటి వెసులుబాటును పేదలకు ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు కల్పించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శుభ వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ



వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ దృశ్యం

**అమరాపురం ఏప్రిల్ 12 ప్రభాత వార్త**

మండల కేంద్రంలోని వీరశైవ కళ్యాణ మండపంలో గౌడనకుంట గ్రామానికి చెందిన సత్య సాయి జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య అన్న కుమారుడు డీలర్ నాగరాజు వివాహ వేడుకల్లోఆదివారం మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ప్రముఖులను పిడి నరసయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమరాపురం టిడిపి కన్వీనర్ కృష్ణమూర్తి, మాజీ జెడ్పిటిసి జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నరసింహమూర్తి, మండల క్లస్టర్ కన్వీనర్ నవీన్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు మద్దనకుంట రఘు, అమరాపురం జడ్పిటిసి పి ఆర్ నరసింహమూర్తి, మాజీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్ జయ కుమార్, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చెన్నప్ప, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా, విరుపాక్ష, సింగల్ విండో డైరెక్టర్ దాదా పీర్, యువ నాయకుడు కెంకెర తమ్మరాయప్ప,,పుల్లికుంట రాజు,మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, మాజీ సర్పంచులు చంద్రశేఖర్ గౌడ్ ప్రకాష్, సెకునప్ప, మాజీ ఎంపీటీసీ లింగరాజు,చెరువు సంఘం అధ్యక్షుడు నరసింహమూర్తి, జిటి అనిల్ కుమార్, మాజీ డీలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కలిపిలో జలధార నీటి నిర్వహణ కార్యక్రమాన్ని ప్రారంభించిన తెదేపా నాయకులు

నీరు వృధా కాకుండా ఎక్కడికక్కడ భూగర్భ జలాలు పెరిగేందుకు ఎన్ డి ఏ కూటమి నాయకులు కృషి.



జల ధార నీటి నిర్వహణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తెదేపా నాయకులు

**రొద్దం. ఏప్రిల్ 12 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఆయా గ్రామాల పరిధిలోని చెరువులోకి వచ్చే నీరు వృధా కాకుండా ఎక్కడికక్కడ కంపచెట్లు తొలగించి కాలువల ద్వారా నీరు సక్రమంగా చెరువులోకి వచ్చే విధంగా ఎక్స్క కవేటర్ సాయంతో జలధర నీటి నిర్వహణ కార్యక్రమాన్ని మండల తెదేపా నాయకులు ఆదివారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జలధర నీటి నిర్వహణ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని ఈ కార్యక్రమం ద్వారా చెరువులోకి సక్రమంగా నీరు చేరితే భూగర్భ జలాలు పెరిగి తద్వారా గ్రామ ప్రజలకు తాగునీరు పంట పొలాలకు సాగునీరు పుష్కలంగా అందుతాయి అనే ఉద్దేశంతో మంత్రి సవిత ఆదేశాల మేరకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలియజేశారు మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి వర్షాకాలంలో నీటిని వృధా కాకుం డా చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశం అని రాబోవు రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ఆయా గ్రామాల్లో ప్రజలు నాయకులు సహకరించాలని కోరడమైనది ఈ కార్యక్రమంలో నరహరి మాధవ నాయుడు చిన్నప్పయ్య చంద్రమౌళి మారెప్ప రెడ్డివారి మంజునాథ్ వీరాంజనేయులు అరుణ్ కుమార్ రెడ్డి రుద్ర ప్రసాద్ ఓబులేసు ఫక్రుద్దీన్ గ్రామస్తులు చెరువు ప్రెసిడెంట్ ఫీల్డ్ అసిస్టెంట్ డీలర్లు తదితరులు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## విద్యార్థులకు క్విజ్ పోటీలు



అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు

**గుత్తి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక రైల్వే ఎస్‌సి, ఎస్‌టి కార్యాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 14న బహు మతుల ప్రదానం చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మనోజ్, కార్యదర్శి రామ్‌నాయక్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ పుష్పరాజ్, రామాంజనేయులు, వెంకటేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగం రాలేదని మృతి చెందిన నిరుద్యోగి కుటుంబానికి పరామర్శ



నారమ్మను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


**బత్తలపల్లి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త**

ఎక్కడా ఉద్యోగం రాకపోవడంతో నిరుద్యోగ యువకుడు దేవరకొండ పెద్దబాబు ఊజీ మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడడంతో, ఆ కుటుంబాన్ని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ఆదివారం మండలంలోని సూర్యచంద్రాపురం గ్రామానికి చేరుకున్న ఆయన పెద్దబాబు ఇంటికి వెళ్లి యువకుడు తల్లిదండ్రులు దేవరకొండ నారమ్మ, వెంకటనారాయణ దంపతులను పరామర్శించారు. గత నెల 21వ తేదీన ఊజి మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడగా చికిత్స పొందుతూ 22వ తేదీన మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లే నిరుద్యోగులను, యువతను కూడా కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నిరుద్యోగభృతి ఇస్తామంటూ చెప్పిన నేతలు ఇప్పుటి వరకు ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. జాబు క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పినా అది ఆచరణలో అమలు కావడంలేదన్నారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు. మృతి చెందిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట దర్మవరం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, మాజీ సర్పంచులు గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, చల్లా కరుణాకర్ నాయుడు, నార్శింపల్లి రామాంజనేయులు, మంజుల రమణ మనోహర్, ఆదినారాయణ, అజయ్, క్రిష్ణా తదితరులు ఉన్నారు.

## పచ్చని పంటపై ఏంటి ఈ పగ

1.59 లక్షల విలువైన పంట, డ్రిప్పు అగ్గికి ఆహుతి.





కాలి బూడిదైన పంట, మొక్కజొన్న కంకెలు కాలిన దృశ్యం.

**గోరంట్ల ఏప్రిల్ 12 ప్రభాత వార్త**

ఐదు నెలలపాటు రాత్రింబవళ్లు కష్టించి మొక్కజొన్న పంట సాగు చేసి మంచిదిగుబడి వచ్చి కోతకు సిద్ధమై తన ఇంటి గుమ్మంకు పండించిన ధాన్యం చేరుకునే టైముకు గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలు మిట్ట మధ్యాహ్నం పొలం వద్ద ఎవరూ లేని సమయంలో ఆ పంటకు నిప్పు పెట్టడంతో తీవ్రం నష్టం వాటిల్లని సంఘటన గోరంట్ల మండలంలోని ఎగువ గంగంపల్లి గ్రామానికి చెందిన రైతు రుద్ర ప్రకాష్ కు చోటుచేసుకుంది. బాధిత రైతు వివరాల మేరకు ఇలా ఉన్నాయి తన గ్రామ చివర తన రెండు ఎకరాల పొలంలో గత ఐదు నెలల క్రితం మొక్కజొన్న పంట సాగు చేశానని దిగుబడి సైతం ఆశ జనకంగా వచ్చిందని అయితే ఒకటి రెండు రోజుల్లో పంట కోత కోసి ఇంటికి చేరే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టి తీవ్ర నష్టాన్ని కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు నిప్పు అంటుకున్న సంఘటన సకాలంలో గమనించి ఆర్పగలిగామని అయినప్పటికీ ఒక ఎకరా పంట తీవ్ర నష్టం వాటిల్లిందని తద్వారా లక్ష రూపాయల దాకా పంట నష్టం తో పాటు మరో 30 వేల విలువచేసే డ్రిప్పు కాళీ బూడిదైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులకు ఆదివారం సాయంత్రం రైతు రుద్ర ప్రకాష్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.జరిగిన నష్టాన్ని సంబంధిత అధికారులు అంచనా వేసి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

## వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చిన ఎస్ఐ



వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ

**రొళ్ల ఏప్రిల్ 12 (ప్రభాతవార్త)**

వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు పలు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ నరసింహుడు సూచించారు.ఆదివారం మండలంలోని రత్నగిరి సమీపంలో రోడ్డుపై వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.టూ వీలర్స్ నడిపేవారు హెల్మెట్లు ధరించాలన్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదన్నారు. రహదారిపై వాహనాలతో రోడ్లు క్రాస్ చేసేటప్పుడు ముందు, వెనుకాల చూసుకొని నడపాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తో పాటు హెడ్ కానిస్టేబుల్ రామలింగయ్య, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పోతురాజుల బండారు కార్యక్రమం



ప్రత్యేక అలంకరణలో పోతురాజు నాట్యం చేసుకోస్తున్న దృశ్యం

**రొళ్ల ఏప్రిల్,12( ప్రభాతవార్త)**

మండలపరిధిలోని సుప్రసిద్ధ చారిత్రాత్మక ప్రదేశంగా పేరుగాంచిన శ్రీ రత్నగిరి కొల్లాపూరి మహాలక్ష్మి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పోతులరాజు బండారు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ కొల్లాపురి మహాలక్ష్మి అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి భద్రకాళిమాత రూపంలో అలంకరించారు.ఈ సందర్భంగా అమలపురాజు ఇంటి నుంచి పోతురాజు ప్రత్యేకంగా అలంకరణ చేసుకొని నృత్యాలు చేసుకుంటూ, మేళ తాళాలతో వాయిద్యాలు నడుమ రాజ వంశీకులు రంగప్పరాజు, కృష్ణప్పరాజులను ఊరేగింపుగా దేవాలయానికి తీసుకువచ్చి పూజలు నిర్వహించారు .అనంతరం పాలభావి సమీపంలో పోతులరాజు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ ఉత్సవాలను తిలకించడానికి సమీప కర్ణాటక ప్రాంతం నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాద వినియోగంతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా స్థానిక ఎస్సై కే.నరసింహుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో రిషి విద్యాలయ వార్షికోత్సవం

- విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకున్నారు....
- విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశాయి



నృత్యం చేస్తున్న విద్యార్థిని విద్యార్థినీలు

**ధర్మవరం రూరల్ ఏప్రిల్ 12, ప్రభాతవార్త**



ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

విద్యార్థుల సమగ్ర అభివృద్ధి విద్యతో పాటు సాంస్కృతిక కార్యకలా పాలు, నైతిక విలువలు కూడా ముఖ్యమని పాఠ శాలలో సాధించిన విజయా లను వివరించి, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి విద్యా ర్థినీ విద్యార్థులను తీసుకెళ్లేం దుకు కృషి చేస్తామని పాఠ శాల డీ.న్ భాస్కర్ రెడ్డి తెలి పారు. ధర్మవరం పట్టణం లోని ఎన్ ఎస్ గేట్ కి వెళ్లే దారిలో ఉన్న రిషి విద్యాలయంలో మొదటి వార్షికోత్సవం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించ బడింది. ఈ వేడుకకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు ప్రముఖులు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ప్రారంభంలో దీపప్రజ్వలనతో వేడుకలను ఆరంభించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకున్నారు. నృత్యాలు వంటి ప్రదర్శనలు తల్లిదండ్రులను మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ సందర్భంగా పాఠశాల డీ.న్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, నైతిక విలువలను పాటించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, నైతిక విలువలను పాటించాలని సూచించారు. సిఏఓ రవీంద్ర తన ప్రసంగంలో పాఠశాల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రధానోపాధ్యాయులు గోపినాథ్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభించబోయే శి5 మోడల్ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారం వల్లే విద్యార్థులు విజయాలను సాధిస్తు న్నారని అభినందించారు. ప్రతిభపోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు, ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను సత్కరించడం జరిగింది. అనంతరం భారీగా వచ్చిన తల్లిదండ్రులకు, విద్యార్థినీ విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ రంగారెడ్డి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన పోలీసులకు ఆత్మీయ సత్కారం



బదిలీపై వెళుతున్న పోలీసులకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్న సిఐ, ఎస్సై, మిగతా సిబ్బంది

**కొత్తచెరువు ఏప్రిల్ 12 ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి జిల్లా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తచెరువు అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ వివిధ మండలాల కు బదిలీపై వెళుతున్న పోలీస్ అధికారులను సర్కిల్ ఇన్స్పెక్టర్ జి మారుతి శంకర్ ఎస్సై వెంకట్ రమణ మిగతా సిబ్బంది వారికి పూలమాలలు దుశలవాల తో ఘనంగా సత్కరించారు బదిలీ అయిన పోలీసులు హెడ్ కానిస్టేబుల్ అన్వర్ భాష, జగదీష్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్స్ శివశంకర్ ఉదయ్ మనోహర్ మారుతి ప్రసాద్, డైమండ్ శీను ఓబుల్ రెడ్డి బదిలీపై వివిధ మండలాలకు వెళుతున్న సందర్భంగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు ఈ సందర్భంగా ఈ స్టేషన్లో పనిచేసిన వారి అనుభవాలను మిగతా సిబ్బందితో పంచుకున్నారు.

## ధ్యానంతో మానసిక రుగ్మతను తొలగించుకోవచ్చు

ఘనంగా గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ



కార్యక్రమానికి హాజరైన పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు, ధ్యానులు

**బత్తలపల్లి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త**



ధ్యానం వల్ల మానసిక రుగ్మతలు తొలగు తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మాల్యవంతం గ్రామంలో గిరిసాయి పిరమిడ్ ధ్యానకేంద్రం వద్ద ట్రస్టు సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ప్రతిష్టించారు. జ్యోతి ప్రజ్వలన కార్య క్రమంతో ధ్యాన కేంద్రం సభ్యులు ప్రతిష్ట చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోను గుంట్ల జయమ్మ,లాయర్ సంపత్ కుమార్, ప్రతాప్ రెడ్డి, శివరాంనాయుడు, రంగనాథరెడ్డి, పిరమిడ్ ధ్యాన కేంద్ర సభ్యులు హాజరైనారు.గౌతమ బుద్ధుడు విగ్రహం ప్రతిష్ట అనంతరం ధ్యాన గురువులు మాట్లాడుతూ ప్రతి మనిషి కళ్లు మూసుకొని శ్వాస మీద ధ్యాస పెట్టడమే ధ్యానమని సూచించారు. శ్వాసను గమనిస్తూ ఏకాగ్రతతో ధ్యానం చేస్తే మానసిక రుగ్మతలను తొలగించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,ధ్యానులు, పిరమిడ్ ధ్యాన ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అతివేగంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

**అగళి, ఏప్రిల్ 12 తర్వాత వార్త**

మండల పరిధిలోని కసాపురం దగ్గర హైవే రోడ్‌లో మడకశిర వైపు నుండి శిర వైపు వెళుతుండగా కారు అతివేగంగా విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఉదయం 6 గంటలకే ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సందర్భంలో అందులో ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. ఓ మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ముగ్గురు ప్రమాదం నుండి బయటపడ్డారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన కారు →



03ATP12_03ATP12.qxd 12-04-2026 PM 11:50 Page 1



# గ్రామీణ రోడ్లకు తప్పని తిప్పలు

## - ఇబ్బందుల్లో ప్రజలు వాహనదారులు.. పట్టించుకోని అధికారులు

పామిడి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

గ్రామీణ రోడ్లకు తిప్పలు తప్పటం లేదు. తరాలు మారినా.. ప్రభుత్వాలు మారినా.. ప్రజాప్రతినిధులు ఎన్నికై వారి పదవీకాలం ముగినిపోయి తిరిగి ఎన్ని కల అనంతరం నూతన ప్రజాప్రతినిధులు ఎన్నిక అవుతున్నప్పటికీ మండలంలోని రోడ్ల రూపురేఖలు మాత్రం మారలేదు ఫలితంగా ప్రజలు వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతుండగా అధికారయంత్రాంగం పట్టించుకున్న పాపానపోలేదన్న విమర్శలు వెల్లవెత్తుతున్నాయి. రోడ్ల దుస్థితి చూస్తున్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణాభివృద్ధికి మహర్థశ కల్పిస్తామని ప్రకటిస్తున్న ప్రభుత్వాలు ఆచరణలో మాత్రం ఆధిశాగా చర్యలు చేపట్టిన దాఖాలాలు లేవని అందుకు నిధర్శనం గ్రామీణ రోడ్లు అద్వా న్నంగా తయారవట మేనన్నది పలువురి వాధన. పెన్నప్ప దేవాలయం నుండి నేమళ్ళపల్లి, పాళ్యం నుండి అప్పాజిపేటకు రాకపోకలు సాగించన్ను రోడ్లు కం కర తేలటం గుంతలమయమై అద్వాన్న స్థితికి చేరుకోవటంతో ఆయాగ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా కొంతమంది ప్రమాదాల బారిన పడతున్నట్లు తెలుస్తోంది. ఈ రోడ్ల పరిస్థితిని చూసి ప్రజలు ఆందోళన చెందుతుండుగా రాకపోకలు సాగిస్తున్న వారి అవస్థలు వర్ణ ణాతీతం. ప్రజాత్రి నిధుల పదవీకాలం ముగిసిపోయి ప్రత్యేక అధికారులు పాలన ప్రారంభమైన నేపద్యంలో సంబందిత అధికా రులు అటు వైను కన్నెత్తి చూడ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజ లు, వాహన దారుల ప్రా ణాల తో చెలగాటం అడుతున్నాన్న ఆరోపణలు బలంగానే వినిపి స్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించి ప్రభుత్వాల లక్ష్యాల కు అనుగు ణంగా గ్రామీణ రోడ్లకు మహర్దశ కల్పిస్తూ ప్రజాసంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ వారి అభ్యున్నతికి పాటుపడాల్సిన అవసరం ఎంతైనావుందని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.



.కంకరతేలి అద్వాన్నంగా మారిన నేమళ్ళపల్లి రోడ్డు

# సేవా దృక్పదం లయన్స్‌క్లబ్ లక్ష్యం

## - డాక్టర్ రోఖియాబేగం, డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు వెల్లడి

## - ఉచిత కంటి మెగా వైద్యశిభిరానికి విశేష స్పందన

పామిడి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

సేవా దృక్పదం లయన్స్‌క్లబ్ లక్ష్యం అని ఆ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ రోఖియాబేగం, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ వాసవి కళ్యాణ మండపం నందు ఆదివారం లయన్స్‌క్లబ్ ఆద్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసు పత్రి, జిల్లా అందత్వ నివారణ సంస్థ వారు ఉచిత కంటి మెగా వైద్యశిభిరాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా డాక్టర్ రోఖియాబేగం, డాక్టర్ నల్లపాటి తిరు పతినాయుడు మాట్లాడుతూ సృష్టిలో మానవజన్మ అద్భుతమైనదని అందులో కంటి చూపు దేవుడు ఇచ్చిన వరం అంటూ ప్రతిఒక్కరూ కళ్ళను నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. లయన్స్‌క్లబ్ ద్వార ఆరోగ్యం పరంగా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని ఈక్రమంలో తోటివారిని సేవా దృక్పదం వైపుగా నడిపిస్తున్నామని తెలిపారు. అద్యక్షులు రఘువీర్‌రావు మాట్లాడుతూ కంటిచూపు జీవత గమ్యానికి మార్గా న్ని చూపి స్తుందన్నారు. సేవా కార్యక్రమాలే లక్ష్యంగా లయన్స్‌క్లబ్ కమిటీ ముందుకు సాగుతోందన్నారు. అనంతరం బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యనిపు ణులు డాక్టర్ ఆలీషా కంటిచూపు మందగించిన 240 మందిని పరీక్షించి వారిలో 104 మందిని ఆపరేషన్లకు రెఫర్ చేశారు. కంటి పరీక్షలు చేయించు కోవటానికి వచ్చిన వారితో శ్రీ వాసవి కళ్యాణ మండపం కిట కిటలాడగా ఉచిత కంటి మెగా వైద్యశిభిరానికి విశేష స్పందన లభించి నట్లైంది. అద్యక్షులు రఘువీర్‌రావు కంటి వైద్యశిభి రానికి వచ్చిన వారం దరికీ అన్నదానం చేశారు. ఈకార్యక్ర మంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్స్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శాంతిప్రి య, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, సంస్థ నిర్వాహకుడు ఆర్‌ఎంపీ వైద్యులు గంగశేఖర్, సహాయ కార్యదర్శి ముండే షేక్షావలి, ఆర్గనై జింగ్ సెక్రెటరీ పత్రా నరేష్‌కు మార్, డైరెక్టర్లు అమర్ నాథ్‌రె డ్డి, పత్రా రాకేష్, నాగరాజు, మానవహక్కుల సంఘం సౌత్ ఇండియా కార్యదర్శి ఆవుల ప్రసాద్, శంకరకంటి ఆసుపత్రి మేనేజర్ శివ, లక్ష్మీ, శంకర్‌కంటి హాస్పి టల్స్ సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.



కంటిచూపు మందగించిన వృద్ధుడి కళ్ళను పరీక్షిస్తున్న డాక్టర్ ఆలీషా

# పిఆర్సి కమిటీని వెంటనే వేసి 30 శాతం ఐఆర్ మంజూరు చేయాలి - రూసో

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

అనంతపురంలోని 10వ తరగతి స్పాట్ కేంద్రం కెఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాల యునైటెడ్ ఆర్గనైజేషన్ (రూసో) అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పలు రూసో సభ్య సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఏపీపీఎస్ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామాం జనేయులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్సి కమిటీని వేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సి గడువు ముగిసి మూడేళ్లు దగ్గర పడుతున్న విషయాన్ని గుర్తు చేసుకోవాలని తెలిపారు.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేత నాలు పెంచాలని కోరారు. ఎన్‌టిఏ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి జయరాం నాయక్, రవీంద్ర బాబు, గిరిజన ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి దేగవత్తు రవి మాట్లాడుతూ.. సిపిఎస్ వెంటనే రద్దు చేయాలని, ప్రతి ఉద్యో గికి ఓపిఎస్ అనువర్తింపచేయాలని కోరారు. పింఛను ఉద్యోగి యొక్క హక్కు అని తెలిపారు. దీన్ని హరించ వద్దని కోరారు. దీంతోపాటు టెట్ నుండి ఉపాధ్యాయులకు ఉపశ మనం కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, పిఎస్ హెచ్ఎంలకు బదిలీల కంటే ముందే సర్దుబాటు చేయాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయు లకు సకాలంలో వేతనాలు చెల్లి ంచి పదవి విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని వక్తలు డిమా ండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యక్షుడు శివశంకర్ రెడ్డి, శర్మావలి, రామ్మూర్తి, నరేంద్రనాథ్, మహిళా ఉపాధ్యా యులు పాల్గొన్నారు.





నిరసన తెలిజేస్తున్న రిజిస్టర్డ్ ఉపాధ్యా య సంఘాల యునైటెడ్ ఆర్గనైజేషన్ నేతలు

# పెద్దమ్మతల్లి జాతరకు వైసీపీ సంపూర్ణ మద్దతు

బుక్కరాయసముద్రం ఏప్రిల్ 12 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం గ్రామంలో జరిగే శ్రీ పెద్దమ్మతల్లి జాతర (ద్యావరా) కు వైసీపీ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఆదివారం బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలోని శింగనమల నియోజకవర్గం వైసీపీ పార్టీ కా ర్యాలయంలో వైసీపీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు విలేకర్లతో మాట్లడుతూ నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో జరిగే పెద్దమ్మ తల్లి జాతరకు మేము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఇప్పటికే జాతరకు సంబం దించిన ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చందాల వసూలు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.కొందరు వ్యక్తులు వారి స్వార్థ ప్రయోజ నాలకోసం చేసే ఆలయ వ్యతిరేక పనులకు మా పార్టీకి సంబందంలేదు,

అది వారి వ్యక్తిగత విషయం.మా నాయకుడు డాక్ట ర్ సాకే శైలజనాథ్ గ్రామ కట్టు బాట్లు,గ్రామ అభివృద్ధికి సహ కారం అందించడం జరుగు తుం ది.ఈ కార్యక్రమంలో వైసీపీ నా యకులు పూలనారాయణ స్వా మి,మాజీ సర్పంచు పార్వ తి,నందినేని శ్రీనివాసులు, వైసీపీ మండల బీసీ సెల్ అధ్యక్షులు చెరుకూరి ఆదినారాయణ, వెంకటేష్,బుల్లే ఈశ్వరయ్య, మాజీ డీలర్లు సత్తి, కుళ్ళాయప్ప, పవన్‌సాయి, ఈదుల ఓబిలేసు, సత్తిరెడ్డి తదితిరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైసీపీ నాయకులు

# ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కార్యక్రమం

బుక్కరాయసముద్రం ఏప్రిల్ 12 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం పై విస్తృ త స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్ర మం సిటిఐఓ, డిపిఎం లక్ష్మీనాయక్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్ట డం జరిగింది.ఈ కార్యక్రమం రైతు భాగ్యలక్ష్మి టి-పసిఆర్‌పి ప్రదీప్ పొలంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం రంగస్వామి (దేశీ ఫెసిలిటేటర్) ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్బంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెద్దన్న మాట్లడుతూ ప్రకృతి వ్యవసాయం రైతులకు ఆర్థికంగా లాభదా యక మనివివరించారు.రసాయనిక ఎరువుల ఖర్చులను తగ్గించి స్థానికంగా లభించే వనరులతో పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలిపారు.జీవామృతం,ఘన జీవామృతం, బీజామృ తం వంటి పద్ధతులను రైతులు పాటించాల న్నారు.అనంతరం రంగస్వామి మాట్లడుతూ రసాయనిక ఎరువు లు, పురుగు మందులు అధికం గా వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతింటూదన్నారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారం పెరుగుతుందని,పంటల నాణ్య త మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ నవీన్ సిబ్బంది సమర్థ వంతం గానిర్వహించారు.



ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

# వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

శింగనమల ఏప్రిల్ 12 ప్రభాతవార్త మండలపరిధిలోని పెరవలి గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు కొర్రపాటి కృష్ణమూర్తి కుమారుడి వివాహానికి ఆదివారంహాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ. టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతినాయుడు. ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

# 135వ అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయండి

.గార్లదిన్నె, ఏప్రిల్ 12,ప్రభాతవార్త :

భారత రాజ్యాంగ శిల్పి, సామాజిక న్యాయ పోరాట యోధుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను ఏప్రిల్ 14న కల్లూరు గ్రామంలో విజయవంతం చేయడానికి గ్రామంలోని ప్రతి ఒక్కరు స్వచ్ఛం దంగా పాల్గొనాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఈ సందర్భంగా ఉదయం అల్పాహారం పంపిణీతో కార్యక్రమం ప్రారంభమై, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులు అర్పిస్తారు. గ్రామంలోని యువత, మహిళలు, విద్యార్థులు, సామాజిక సంస్థలు, ప్రజా ప్రతినిధులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రతి ఒక్కరూ సమయానికి హాజరై, కార్యక్రమాన్ని శాంతి యుతంగా, ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరుతూ, అంబేద్కర్ చూపిన మార్గాన్ని అనుసరిస్తూ సమాజ అభివృద్ధికి కట్టుబడి ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# రాష్ డ్రైవింగ్, స్టంట్స్ చేసిన వారిపై చర్యలు

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

మోటర్‌సైకిల్‌పై రాష్ డ్రైవింగ్, స్టంట్స్ చేస్తున్న వారిపై పోలీసులు చర్యలు చేపట్టారు. తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాష్ డ్రైవింగ్, స్టంట్స్ చేస్తున్న ఇద్దరు మైనర్లను గుర్తించి వారితో పాటు వాహనాన్ని అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి సిఐ శివగంగాధర్‌రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. అలాగే వాహనాన్ని సీజ్ చేశారు. మరలా ఇలాంటివి జరగకుండా వారిపైన వారి తల్లిదండ్రుల పైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ పేర్కొన్నారు.



స్కూటర్‌పై స్టంట్స్ చేసిన వారిని అదుపులోకి తీసుకున్న దృశ్యం

# వృద్ధులకు చీరలు పంపిణీ

పుట్లూరు, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

పుట్లూరు మండలం అరకటివేముల గ్రామంలో ఆదివారం ఎంఆర్‌పిఎస్ నాయకులు వృద్ధులకు చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ, మంద జ్యోతి పెళ్లిరోజు సందర్భంగా చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగుల హక్కుల కోసం పోరాడటం వల్లనే పెన్షన్లు పెరిగాయని, గుండె జబ్బుల పిల్లల కోసం చేసిన పోరాటాల వల్లనే ఆరోగ్యశ్రీ పథకం రూపుదిద్దుకుందని గుర్తు చేశారు. ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో 30 ఏళ్లపాటు మాదిగలు సాగించిన పోరాటాల వల్లనే నేడు ఎస్‌సి వర్గీకరణ అమలు జరుగుతోందన్నారు. అనంతరం మంద కృష్ణమాదిగ దంపతులు వందేళ్లు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్, శింగనమల నియోజకవర్గ ఎంఇఎఫ్ నేత మీసాల నారాయణస్వామి, ఎంఆర్‌పిఎస్ మండల నేత మీసాల శేఖర్, ఎంఇఎఫ్ జాతీయ అదనపు కార్యదర్శి బండారు శంకర్, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు చీరలు పంపిణీ చేసిన దృశ్యం

# ఘనంగా ఎన్టీఆర్ నందమూరి తారక రామారావు విగ్రహ భూమి పూజ కార్యక్రమం



విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ చేస్తున్న పలువురు తెదేపా కుటుంబ సభ్యులు



భూమి పూజ కార్యక్రమం లో మాట్లాడుతున్న మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు,

నల్లచెరువు ఏప్రిల్ 12 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బస్టాండ్ మూడు రోడ్ల కూడలిలో స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు విగ్రహ ప్రతిష్టకు మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు, ఆధ్వర్యంలో మండల తెదేపా సీనియర్ నాయకులు కార్యకర్తలు తో కలిసి ఆదివారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు పలువురు సీనియర్ టిడిపి నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అహర్నిశలు కష్టపడి పని చేశారని..2 రూపాయలకే కిలో బియ్యం, బీసీ రిజర్వేషన్లు, మండల వ్యవస్థను, మధ్యాహ్న భోజన పథకం, మహిళలకు ఆస్తి హక్కు ఇంకా మరెన్నో పథకాలను ప్రారంభించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు కె చెందుతుందని టిడిపి నాయకులు కొనియాడారు.

అలాంటి మహానుభావుని విగ్రహానికి భూమి పూజ నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు మండల టిడిపి నాయకులు తెలిపారు.. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ దాదం శివారెడ్డి , సహకార సంఘం అధ్యక్షులు కుండా వెంకటరమణ, మాజీ ఎంపీపీ మాబు సాబ్, మాజీ జెడ్పిటిసి నాగభూషణ నాయుడు, అబ్దుల్ ఖాదర్, బార్ బసీర అహ్మద్, మార్కెట్ యాడ్ వైస్ చైర్మన్ జక్కా లక్ష్మీనారాయణ ,మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ అస్వర్థ నాయుడు, మాజీ సర్పంచులు హర్షవర్ధన్ నాయుడు, నాగరాజు, ఎద్దుల అంజనప్ప, తెలుగు యువత అధ్యక్షులు గుత్తా ప్రసాద్ , టిడిపి మండల జనరల్ సెక్రెటరీ సతీష్ చౌదరి, నాగిరెడ్డి, రమేష్ నాయుడు, అల్లా బక్షు, చంద్రబాబు, కరుణాకర నాయుడు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు

# మాంటిస్సోరికి నేషనల్ స్కూల్ అవార్డ్

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

నగరంలోని సంగమేష్‌నగర్, గుత్తిరోడ్‌లో మాంటిస్సో రి పాఠశాలలకు జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. నేషనల్ స్కూల్ అవార్డ్స్ అసోషియేషన్‌చే బెంగుళూరులో నిర్వహించబడిన నేషనల్ స్కూల్ అవార్డ్స్- 2026 కార్యక్రమంలో మాంటిస్సో రి పాఠశాలలకు ఫ్యూచరిస్టిక్ ఎడ్యుకేషన్ ట్రెండ్స్‌ను అనుసరించే జాతీయ ఉత్తమ పాఠశాలలుగా అవార్డు ప్రధానం చేశారు. అవార్డును స్వీకరించిన పాఠశాలల కరస్పాండెంట్ సి.సూర్యనారా యణరెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్ విద్యా విధానాలవైపు అడుగులు వేస్తూ, పిల్లలతో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించడమే తమ లక్ష్యమని వెల్లడించారు. తమ ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ప్రతిభ, తల్లిదండ్రులు తమపై ఉంచిన భరోసా వల్ల ఈ అవార్డు సాధ్యమైందని తెలియ జేశారు. ఈ అవార్డు విద్యా రంగంలో మరిన్ని నూతన ఆవి ష్కరణలను ప్రేరణ ఇవ్వను న్న దని ఆయన తెలిపారు. జాతీ య స్థాయిలో తమ పాఠశా లలకు ప్రతిష్టాత్మక గౌరవం, గుర్తింపు లభించటంపై పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్త పరిచారు.





అవార్డును అందుకుంట ఎన్న దృశ్యం

# 16న గ్రామసభ

యల్లనూరు, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

యల్లనూరు మండలం పాతపల్లి గ్రామంలో వెలసిన అంకాలమ్మ దేవస్థానంలో అర్చకత్వం హక్కుకు సంబంధించి ఈ నెల 16వతేదీ గురువారం మధ్యాహ్నం 12 గంటలకు దేవస్థానంలో గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని దేవాదాయశాఖ అధికారిని ఎస్.శోభ తెలిపారు. కావునా గ్రామస్తులు ఈ గ్రామసభకు హాజరు కావాలని ఆమె కోరారు.

# నేడు డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్

అనంతపురం కలెక్టరేట్ ఏప్రిల్ 12 ప్రభాతవార్త

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 ,30 గంటల వరకు డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా , తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు: 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 వరకు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ క్రింద పేర్కొన్న నంబర్లకు కాల్ చేయవచ్చునని తెలియజేశారు.తిరుపతి: 8712652679, చిత్తూరు: 7993147979,నెల్లూరు: 0861232 0427, అన్నమయ్య: 9440817449 ,కడప: 08562242457, కర్నూలు: 7382614308 ,నంద్యాల: 7382618976, అనంతపురం: 9154790350 ,శ్రీసత్యసాయి జిల్లా 9963707847,ఈ సదవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



CHANGE OF NAME

I, SATAJA BEGUM SOWDAGAR (Old Name), W/o Sowdagar Abdul RAHMAN KHAN Residing at D.No: 7-207, Bhairava Nagar, Taj Homes, Anantapur DT, 515001. I have Changed My Name from Sataja Begum Sowdagar (Old Name) to **SHATAJ SOWDAGAR** (New Name) Hence forth my name will be called as **SHATAJ SOWDAGAR**

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

## నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం

## జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ ఏప్రిల్ 12 ప్రభాతవార్త

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100 అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నేడు అనగా సోమవారం అనం తపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక , రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొం టారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్య లకు సంబంధించి అర్జీలను అందజేయాల న్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావా లన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్

# అనంతపురం జిల్లా విద్యార్థినికి జపాన్ సైన్స్ టెక్నాలజీ నుండి ఆహ్వానం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

గుంతకల్ మండలం కసాపురం జడ్పిహెచ్ఎస్‌లో 10వ తరగతి వరకు చదివి ప్రస్తుతం ఇడుపులపాయలో ఇంటర్ చదువుతున్న కావలి జ్యోతి మార్గదర్శక ఉపాధ్యాయులు నారాయణ సహాయంతో సోలార్ మల్టీపర్పస్ ఫోర్టబుల్ టెంట్ తయారు చేసిన నమూనాకు ఇన్స్పైర్ మోనార్క్ నేషనల్ లెవెల్కు వెళ్ళడం జరిగింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుండి 5 మందికి సకుర ప్రోగ్రామ్ క్రింద జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు యంగ్ టాలెంట్స్ సైన్స్ నాలెడ్జ్ షేరింగ్‌కు అవకాశం కల్పించారు. దీనికి గాను అనంతపురం జిల్లా విద్యార్థిని ఎంపిక కావడం పట్ల డిఈఓ శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష ఎపిసి శైలజ, పాఠశాల హెచ్ ఎం ఉపాధ్యా యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేకంగా ఇంతటి అవకాశం రావడానికి ప్రోత్స హించిన మార్గ దర్శక ఉపాధ్యాయులు నారా యణకు ధన్యవాదాలు తెలిపారు.



జపాన్ సైన్స్ టెక్నాలజీ నుండి ఆహ్వానం అందిన కావలి జ్యోతి

# మరో నెలలోగా చెరువు మరమ్మత్తు పనులు పూర్తి చేయండి

## - అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి ఏప్రిల్ 12 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని రెడ్డి వారి కుంట చెరువు మరమత్తు పనులు నెలలోగా పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. డీఎంఎఫ్ గ్రాంట్ 86 లక్షల వ్యయంతో చేపడుతున్న చెరువు మరమ్మతుపనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. పనులు ఎంతవరకు వచ్చాయని ఆరా తీశారు.

ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు వివరించారు. మిగిలిన పనులు కూడా నెలలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పనులు నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దన్నారు. కట్ట నిర్మాణం, రివిటింగ్ లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తూముల రిపేరీ కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల ఇరిగేషన్ ఏఈలు మురళి, బి.రమేష్, టిడిపి మండల కన్వీనర్ యాతం పోతులయ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాల సమస్యలపై ..ప్రత్యేక అధికారుల దృష్టి సారించేరా?

కంబదూరు, ఏప్రిల్ 12, ప్రభాతవార్త

ఏపీలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీల పాలన బాధ్యతలను ప్రభుత్వం ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఈ నేపథ్యంలో కంబదూరు మండలంలోని 12 పంచాయతీలు, 42 గ్రామాలు ప్రస్తుతం ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి.సాధారణంగా సర్పంచులకు ఉండే గ్రామసభల నిర్వహణ, పారిశుద్ధం పర్యవేక్షణ, తాగునీటి సరఫరా, పంచాయతీ నిధుల నిర్వహణ, చెక్కులపై సంతకాలు వంటి కీలక అధికారాలు ఇప్పుడు ప్రత్యేక అధికారుల చేతుల్లోనే ఉన్నాయి. దీంతో గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం పూర్తిగా అధికారుల పనితీరుపై ఆధారపడి ఉంది.

అయితే వేసవికాలం ప్రారంభం కావడంతో పల్లెల్లో తాగునీటి సమస్యలు తీవ్రంగా మారుతున్నాయి. బోర్లు ఎండిపోవడం, సరైన నీటి సరఫరా లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో రోజువారీ అవసరాలకు కూడా నీరు దొరకని పరిస్థితి కనిపిస్తోంది. మర్రి మాకులపల్లి, రాంపురం ఇతర గ్రామాల్లో వీధిలైట్లు లేక కాలనీలు చీక ట్లో దర్శనమిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యేక అధికారులు క్షేత్రస్థా యిలో పర్యటించి సమస్యలను గుర్తిస్తున్నా రా? ప్రజల సమస్యలను స్వయ ంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రజలు మాత్రం అధికారులు గ్రామాల్లోకి వచ్చి పరిస్థి తులను ప్రత్యక్షంగా పరిశీలించి, నీటి ట్యాంకర్ల ఏర్పాటు, పాడైన బోర్ల మరమ్మతులు, కొత్త బోర్ల తవ్వకం వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే పారిశుద్ధం, గ్రామసభల నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న సమస్యల నేపథ్యంలో ప్రత్యేక అధికారులు చురుకుగా స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తారా? లేక సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చుతాయా అన్నది వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# అనంతపురం రెడ్డి కళ్యాణ మండపం నిర్మాణానికి గోర్ల అంజన్ రెడ్డి 10 లక్షల ఆర్థిక సాయం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త

అనంతపురం నగరంలో నిర్మించ తలపెట్టిన రెడ్డి కళ్యాణ మండపం నిర్మాణానికి గొల్ల అంజన్ రెడ్డి 10 లక్షల సహాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు రెడ్డి కళ్యాణమండపం నిర్మాణానికి పూనుకున్న ముఖ్యులకు ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన అందించిన ఈ అపూర్వ మైన మహాదానం సేవాస్ఫూర్తికి, రెడ్డి సమాజం పట్ల ఉన్న అపారమైన ప్రేమకు, సంఘాభివృద్ధి కోసం కలిగిన గొప్ప బాధ్యతాభావానికి చిరస్థాయిగా నిలిచే మహోన్నత ఉదాహరణగా నిలిచింది రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్య నాయకులు తెలియజేశారు.ఇంతటి ఔదార్యం సమాజ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుంది అని, ఆయన దాతృత్వం ప్రతి ఒక్కరికి ప్రేరణగా, ఆదర్శంగా నిలుస్తుంది అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు వై.వి.శివారెడ్డి, బిఎస్ఎన్ఎల్ రాజశేఖర్ రెడ్డి, పల్లె చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# 50 శాతం ఉన్న మహిళా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

## - యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కోటేశ్వరప్ప, రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ రమణయ్య

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు ఒక వినతి పత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా 50 శాతం మహిళా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరికి అనేక సమస్యలు ఉన్నాయి అందులో అందులో భాగంగా ప్రతి పాఠశాలలో వాష్రూమ్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి. వీరికి ప్రత్యేక స్టాఫ్ రూమ్ ఏర్పాటు చేయాలి. మానసిక ఒత్తిడికి గురికాకుండా స్ట్రెస్ మేనేజ్మెంట్ కౌన్సిలర్స్ నియమించాలి. చైల్డ్ కేర్ లీవ్‌ల వినియోగంలో మార్పులు తేవాలి. జిల్లా కేంద్రంలో ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటు చేయాలి. తల్లిదండ్రులను అత్తమామలను చూసుకోవడానికి సంవత్సరానికి పది రోజులు పేరంటల్ కేర్ లీవ్ మంజూరు చేయాలి. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోటేశ్వరప్ప, రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ రమణయ్య, రాష్ట్ర కౌన్సిలర్ గోవిందరాజులు, జిల్లా కార్యదర్శి అర్జున్, సీని యర్ నాయకులు నాగేంద్ర, మండల పట్టణ నాయకులు శ్రీనివాసులు, బసవరాజు, అనిల్ కుమార్, సురేష్ బాబు, నాగార్జున, వెంకటేష్ పాల్గొన్నారు.



జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# ఉపాధిహామీ పథకంలో కుట్ర కోణంలో కేంద్రంలో భాగస్వామిగా ఉన్న సీఎం చంద్రబాబు ఎందుకు పట్టించు కోలేదు

## - సిపిఐ పోరాటానికి మద్దతుగానిలుస్తాం - వైసిపి బిసి సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి బిసి రమేష్‌గౌడ్

అనంతపురం సిటీ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

పేదల ఆకలి తీర్చేందుకు ప్రవేశ పెట్టిన ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం వెనుక కుట్ర కోణం దాగి ఉందని వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి బిసి సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బిసి రమేష్‌గౌడ్ విమర్శించారు. ఉపాధిహామీ పథకం నిర్వీర్యం యత్నాలను నిరసిస్తూ సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, ఏపి వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పథకం పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమానికి బిసి రమేష్‌గౌడ్ హాజరై సంఘీభావాన్ని ప్రకటించారు. సిపిఐ నేతలతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట ్లాడుతూ.. ఉపాధిలేక పొట్టకూటి కోసం పేద కుటుంబాలు వలసలు వెళ్తుం డటంతో గ్రామాలలోనే వారికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో నాటి యుపిఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. అనంతపురం జిల్లా బండ్లపల్లిలో ప్రతిష్టాత్మకంగా నాటి యుపిఏ అధ్య క్షురాలు సోనియా గాంధీతో కలిసి నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజ శేఖర్‌రెడ్డి జాతీయ ఉపాధిహామీ పథకాన్ని జాతికి అంకితం చేశార న్నారు. నాటి నుంచి కరువు భారిన పడుతున్న పేదలందరికీ ఉపాధిహామీ వెన్నుద న్నుగా నిలిచిం దన్నారు. అయితే నేడు ఎన్‌డిఏ ప్రభుత్వం కార్పోరేట్లకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో క్రమక్రమ ంగా ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆయన విమర్శిం చారు. కేంద్రంలో కీలక భాగ స్వామిగా ఉన్నప్ప టికీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, జా తీయ ఉపాధి హామీ పథకాన్ని పర్యవేక్షిసు ్తన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. యదావిధిగా ఉపాధిహామీ పథకానికి కేంద్రం వాటా 90 శాతం కేటాయించాలని కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మాణం చేస్తే రాష్ట్రంలో మాత్రం తీర్మాణం చేయకుండా ఎవరి ప్రయోజనాల కోసం పేద లను తాకట్టు పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. పేదలకు అన్యాయం జ రిగే ఏ కార్యక్రమాన్నైనా వైసిపి వ్యతిరేకిస్తుందని, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ అంశంలో స్పష్టమైన వైఖరితో ఉన్నారని ఆయన తెలియజేశారు. పేదల పక్షాన పోరాడుతున్నసిపిఐ పార్టీకి సంపూర్ణ సంఘీభావాన్ని తెలుపుతున్నామని, పోరుబాటకు తాము కూడా అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.



సిపిఐ నేతల పాదయాత్రలో పాల్గొని సంఘీభావం ప్రకటించిన బిసి రమేష్‌గౌడ్

# వైకాపా సీనియర్ నాయకుడు ఆకులేడు రామచంద్రారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

## వైస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబ శివారెడ్డి

శింగనమల ఏప్రిల్ 12 ప్రభాతవార్త

వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు ఆకులేడు రామచంద్ర రెడ్డి మృతి పార్టీకి తీరని లోటుఅని వైస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబ శివారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆకులేడు గ్రామానికి చెందిన వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు రామచంద్ర రెడ్డి (75) అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న వైస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నారై వింగ్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి గ్రామానికి వెళ్లి రామచంద్రారెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని నింపి భరోసా కల్పించారు.ఈకార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు వైస్సార్సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొమ్మన శ్రీరామిరెడ్డి, వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు నరేందర్ రెడ్డి, ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కంటైనర్ ఢీ కొనడంతో విరిగిన విద్యుత్ స్తంభం

## - తృటిలో తప్పిన ప్రమాదం

తనకల్లు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

చెన్నై నుండి పెనుకొండకు వెళుతున్న ఓ కంటైనర్ అతివేగంగా వెళుతూ నియంత్రించుకోలేక రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న సంఘటన ఆదివారం తనకల్లు మండల పరిధిలోని సిజి ప్రాజెక్టులో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో విద్యుత్ స్తంభం విరిగింది. అయితే స్తంభం విరిగిన వెంటనే ఫీజులు పోవడంతో పెనుప్రమాదం తప్పినట్లు అయింది. గతంలో కూడా కంటైనర్లు అతివేగంగా వెళుతూ రోడ్డు పక్కన ఇళ్లలోకి దూసుకెళ్లిన సంఘటనలు లేకపోలేదు. పెనుకొండ వద్ద కియో కంపెనీ పెట్టినప్పుడు నుండి కొక్కంటి క్రాస్ నుంచి మహమ్మదాబాద్ క్రాస్ వరకు అతివేగంగా వెళుతున్న కంటైనర్ల ద్వారా అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కంటైనర్ల డ్రైవర్లు వంద కిలోమీటర్ల వేగంతో వెళుతుండడంతో వేగం నియంత్రించుకోలేక తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ కంటైనర్ అతివేగంగా వెళుతూ రోడ్డు పక్కన వెళుతున్న గొర్రెల మందపై దూసుకెళ్లడంతో ప్రమాదం చోటు చేసుకుంది. అంతేకాకుండా సిజి ప్రాజెక్టులో పంచర్ షాప్ వద్ద బొలెరో వాహనానికి పంచర్ వేస్తున్న సమయంలో ఓ కంటైనర్ బొలెరోపై దూసుకెళ్ల డంతో అప్పుడు కూడా ప్రమాదం చోటు చేసుకుంది. తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లాలంటే భయపడుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాల్లో నష్టపోయిన వారికి పరిహారం అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా కంటైనర్ల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయ ాలని గ్రామస్తు లు షాకీర్, పాండు, రహీం, పంచర్ షాపు బాషా, రవి, సోము, తదితరులు అధికారులను కోరుతున్నారు.



విరిగిన విద్యుత్ స్తంభం

# అనంతలో అర్ధరాత్రి ఎస్పీ తనిఖీలు

## - 34 డ్రంకెన్, 91 ఓపెన్ డ్రంకెన్ కేసులు

అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 12 ప్రభాతవార్త

ఆపరేషన్ నైట్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా ప్రజల భద్రతను జిల్లా ఎస్పీ జగదీష్ సమీక్షించారు. 34 డ్రంకెన్ డ్రైవ్, 91 ఓపెన్ డ్రింకింగ్ కేసులను నమోదు చేసారు. అర్ధరాత్రి 12:30 గంటల ప్రాంతంలో సప్తగిరి సర్కిల్, టవర్ క్లాక్ కూడలి, శ్రీ కంఠం సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాలలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. డ్రంకన్ డ్రైవ్ పై చర్యలు తీసుకోవడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, నష్టాలపై అవగాహన కల్పించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తో జరిగే రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం గురించి వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. యువతకు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. రాత్రి వేళ అనవసరంగా సంచరిస్తున్న వ్యక్తులను ఆపి విచారించారు.

ప్రజల భద్రత దృష్ట్యా వారి వివరాలు నమో దు చేసి జాగ్రత్తలు చేశారు. ప్రజలు భయపడకుండా సురక్షితంగా సంచరి ంచేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలపై ఆదేశాలిచ్చారు. అర్ధరాత్రి అవసరం ఉన్న వారు మాత్రమే బయట తిరగాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో అనుమా నాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్రోలింగ్ వాహనాల నిరంతర సంచారం కొనసాగించాలన్నారు. నిత్యం బీట్ కానిస్టేబుళ్లు అప్రమత్తంగా ఉండాల న్నారు. పోలీసులు రాత్రి వేళల్లో చురుకుగా పనిచేయాలన్నారు. సీసీ కెమె రాలను ప్రత్యక్షంగా సీసీటీవీ కెమెరాల పనితీరు పరిశీలన, లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని ఆదేశాలు ఇచ్చా రు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కఠినంగా నిర్వహి ంచాలన్నారు. అనవసరంగా తిరగాడే యువక ులల తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ చేయాలన్నారు. నగరంలో నేరాల నియం త్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెంపు లక్ష్యంగా రాత్రి వేళ భద్రత కోసం ఇలాంటి తనిఖీలు నిరంతరం నిర్వహిస్తామ న్నారు.



అర్ధరాత్రి డ్రంకెన్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

# సంధ్యామూర్తి ఆధ్వర్యంలో సంధ్యా పరంపర

అనంతపురం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం పట్టణంలోని కృష్ణ కళామందిరంలో సంధ్యామూర్తి ఆధ్వర్యంలో సంధ్యా పరంపర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపు పదివేల మంది నాట్యంలో శిష్యులను తయారు చేసినటువంటి సంధ్యామూర్తిని ఈ సందర్భంగా అభినందించారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకి సాంస్కృతిక కలలైన నాట్యము, సంగీతము వంటి వాటిని తప్పక నేర్పించాలని, విద్యతో పాటు కలలను నేర్చుకోవడం ద్వారా పిల్లల్లో మానసిక, శారీరక సామర్థ్యాలు పెరిగి ఉన్నత అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. నృత్య కళలకు కృషి చేస్తున్నటువంటి సంధ్యామూర్తి గొప్పవారని తెలిపారు. కలల కోసం శ్రీ నిత్య కళానిలయం ఎంతో కృషి చేస్తుందని ఎంపీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మలోల, నాగసాయి హిమజ, ఆల్ ఇండియా రేడియో హారిక పాల్గొన్నారు. పిల్లల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





మాట్లాడుతున్న అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ



సభకు హాజరైన కళాకారులు

# దశాబ్ద కాలంగా స్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడ్డ ప్రజలు

## - వార్తలో పలు కథనాలు స్మశాన వాటికలపై ప్రచురణ - దీర్ఘకాలిక సమస్యలకు స్పందించిన ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు - 13.40 ఎకరాలు స్మశాన వాటికలకు రెవెన్యూ అధికారులు కేటాయింపు

అగళి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

నిరుపేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలకు అసలు భూములే ఉండవు. దున్నడానికి కాదుకదా చనిపోయిన వారిని పూడ్చడానికి భూములు లేక దశాబ్ద కాలంగా ఇబ్బందులు పడ్డారు. స్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతూన్నరని, ఏటిలోనో మరోచోటో మృతిచెందిన వారిని పూడుస్తున్నారని పూడ్చిన మొదటి సంవత్సరం సమాదులు లేక వాటికి పూజలు, పునస్కారాలు చేయక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో పేదలకు స్మశాన వాటికలు లేవన్న విషయాన్ని వార్తలో పలు సార్లు కథనాలు ప్రచురించబడ్డాయి. ఆ కథనాలకు స్పందించి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి స్పందించి అగళి మండలంలో పేదలకు స్మశాన వాటికల కోసం స్థలాలను కేటాయించాలని, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ దేశాల ప్రకారం రెవెన్యూ అధికారులు మండలంలో 13.40 ఎకరాలను స్మశాన వాటికల కోసం కేటాయించారు. ఆలూడి, కదిరేపల్లి, కరిదాసనపల్లి, బ్యాడిగెర, వడగుంట నపల్లి, యుటిపల్లి, ఇరిగేపల్లి, రామాపురం, బొమ్మాసనపల్లి, ఆర్‌జిపల్లి, ముకడాంపల్లి, దాసే గౌడనపల్లి, హనుమనపల్లి, పూల పల్లి, గంగమరపల్లి, కోడిపల్లి, దొక్కలపల్లి, అల్లికెర, లక్ష్మీపురం, బీరన పల్లి,నర్సాంబూది, రామణ పల్లి, పురుషాంగనపల్లి, కసాపురం, జిజి హల్లి, హుల్లేకెర, గాయత్రి కాలనీ, మధూడి, అగళి తదితర గ్రామాలకు స్మశాన వాటికల నిర్మాణాల కోసం రెవెన్యూ అధికారులు భూములు కేటాయించారు. దశాబ్ద కాలంగా చనిపోయిన వారిని పూడ్చడానికి స్థలం లేక ఇబ్బందులు పడ్డ పేదల కన్నీటిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి చొరవతో ఆ సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేవలం చనిపోయిన వారు భూములున్న యజమానులు మాత్రం పూడ్చి సమాధులు నిర్మించి ప్రతి యేటా పూజలు నిర్వహించుకునే వారు అ లాంటి వెసులుబాటును పేదలకు ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు కల్పించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని సత్కరించిన రవికుమార్

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

వైసిపి రాష్ట్ర బిసి సెల్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన గన్నెవారిపల్లికాలనీ ఎంపిటిసి రవికుమార్ ఆదివారం తాడిపత్రి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం